# మహోపకారం

శ్రీమతి టి. అనసూయాదేవి

హోరుమని వర్షము క్షోణీపాతంగా కురుస్తోంది. కారుమబ్బులు, ఉరుములు, మెరుపులతో ఆకాశం ఆవరించియుంది. తూరుపువైపు కిటికీలోనుంచి పచ్చని చెట్లతో కప్పుకొనియున్న కొండలు మెరుపుల వెలుతురులో కనుపిస్తున్నవి. వర్షము క్షణ క్షణానికి అధికమగుచున్నది. ఏమీతోచక బల్లమీద నున్న పుస్తకములను తిరగేస్తున్నాను. ఇంతలో ఎవరో తలుపుతట్టినట్లు శబ్దమయింది.

"అక్కా! ఎవరో తలుపు తడుతున్నట్లుంది" అన్నాను.

మా అక్క కాంతం వెళ్ళి తలుపుతీసింది. తడిసిన బట్టలతో మా బావ మద్రాసునుండి మెయిలు దిగి వచ్చాడు. ఇంట్లో మాఅమ్మ, నాన్న లేరు. మా బావకు స్నానానికి నీళ్ళక్రింద మంటపెట్టడం మొదలుపెట్టింది. ఇంతలో మా స్నేహితురాలు సరస్వతి ఏదో పుస్తకము చేతబట్టుకొని మా ఇంటికి వచ్చింది. వర్షము యింకా కురుస్తునేయున్నది. సరస్వతి రాక నాకు చాల ఆనందం కలిగించింది.

"నీవు యీ వర్షములో రావేమోననుకొన్నాను. మాఅమ్మ, నాన్న ఎవరు లేకపోవడమువలన బిక్కు బిక్కుమంటూ ఏమితోచటంలేదు. ఇంతలో మా బావ మద్రాసునుండి రైలుదిగి వచ్చాడు" అన్నాను.

ఆమాటలు వినగానే సరస్వతిలో ఏదో మార్పు కనుపించింది.

మా బావ "ఎవరా అమ్మాయి" అని అక్కను అడిగాడు.

"ఆయమ్మాయి భర్త మద్రాసులో లా చదువుతున్నాడు. మేనరికం చేశారు. ఆమె తండ్రికి వేరు సంతతిలేదు. తర్డుఫారము చదివి ట్రెయినింగుకు వెళ్ళి ప్రస్తుతము గరల్స్‌స్కూలులో టీచరుగా పని చేస్తున్నది. చాల అందమైనవాడని, తనకుమాత్రెకు తగినవాడని, పైగా చిన్నప్పటినుండి తనయింట్లో యుండే చదువుకొంటుండేవాడు; కాబట్టి మగపిల్లలు లేని కారణమువలన అన్ని విధముల ఆలోచించి సరస్వతిని రామారావుకిచ్చి వివాహం చేశాడు.

కాని పట్నవాసపు విలాస జీవితము మూలంగా త్రాగుడు అలవాటుఅయి రెండు సంవత్సరములలో 20000 రూపాయలు ఖర్చుపెట్టాడు. చదువుకు సముతకు స్వస్తిచెప్పాడు.

భార్య పుష్పవతిఅయింది. ఈమధ్య తండ్రికి చాల జబ్బుచేసి టెలిగ్రాం యిచ్చినను రాలేదు.

రామారావు తండ్రి గౌరవనీయుడు; కొడుకును మదలిస్తూ "మనఐశ్వర్యమునంతయు దుర్వినియోగం చేస్తున్నావు. ఒక పరస్త్రీలోలుడవై అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య గొంతు కోయడం న్యాయం కాదు. మనవంశానికి కళంకము తెస్తున్నావు. ఇంతచదువు చదువుకొని అజ్ఞానాంధకారములో మునిగిపోతున్నావు. వృద్ధాప్యములోనున్న నన్ను, మీతల్లిని, చేసుకొన్న భార్యను సంతోషపెట్టవలసిన నీధర్మమును గుర్తించు" అని జాబు వ్రాశాడు దానికి జబాబులేదు. తల్లిదండ్రులు, అటు అత్తగారు క్రుంగి క్రుసించి పోతున్నారు." అని అన్నము పెడ్తూ మా అక్క బావతో చెప్పింది.

మా బావ తెల్లబోయి "రామారావు నా స్నేహితుడు, అతనిని నేను అనేకసార్లు మందలించాను వినక బంగారములాంటి భార్యనువదలి పరస్త్రీలోలుడైనాడు. ఈసారి మద్రాసునుండి వచ్చేటప్పుడు పిలుచుకొనివచ్చి భార్యాభర్తలను జత పరుస్తాను" అన్నాడు.

మరునాడు మా నాన్న, అమ్మ వచ్చారు. అక్కను వెంటబెట్టుకొని మా బావ మద్రాసుకు వెళ్లిపోయాడు.

ఒకనాడు మాఅక్క, బావకలసి బీచికి వెళ్లారు. దారిలో రామారావు కనుపించి "హల్లో!" అని పలుకరించాడు.

మా బావ "రామారావు! ఒకసారి మాయింటికి రారాదూ! కొన్ని విషయాలు నీతో ప్రైవేటుగా మాట్లాడాలి" అన్నాడు.

"ఆదివారంనాడు మీకు శలవు కాబట్టి ఆనాడు తప్పక వస్తాను" అని చెప్పి రామారావు వెళ్లాడు.

సాయంత్రము 6 గం॥లయినది. ప్రభాకరుడు పశ్చిమదిశ నలంకరించాడు. చంద్రోదయానికి పూర్వము వచ్చేపిల్లవాయువులు అప్పడే కొంచము కొంచముగా సాగుతున్నవి. మధ్యాహ్నపు వడగాడ్పులకు వెసబోయిన ప్రాణులు అప్పుడప్పుడే కోలుకొంటున్నవి. మా బావ వాలుకుర్చీలో కూర్చొని పేపరు చదువుకొంటున్నాడు. రామారావు రిక్షాదిగి వచ్చాడు. ఎదురుగానున్న కుర్చీ చూపిస్తూ ఆహ్వానించాడు మా బావ.

మౌనాన్ని భేదిస్తూ మా బావ "రామారావు! నీతో ఒక విషయం చెప్పదలచుకొన్నాను. నా మాటవింటావనే నమ్మకంతోనే సాహసిస్తున్నాను. నీకది హితవుగా కనుపించకపోవచ్చును. ముందు ముందదే సౌఖ్యదాయకమవుతుంది" అన్నాడు.

రామారావు 'ఏమిటబ్బా! అది' అన్నట్లు చిరునవ్వు వెలిబుచ్చాడు.

"నీబాగును ఆశించే చెప్పుతున్నాను. ఈ డబ్బు దుర్వినియోగమేమిటి? పంకువంటి సంసారమును, నీకొరకు తపించిపోతున్న బంధుమిత్రులను తృణీకరించడము ఏమిబాగున్నది? నీలాంటివాళ్లం మేమంతా కాపురము చేసికొనడంలేదా? వంశమర్యాదను నిలబెట్టుకోవాలి కాని కళంకము తెచ్చుకోడం నీవంటి ప్రాజ్ఞులకు తగినదికాదు. నీవంటి విద్యావంతునికి, నీవు ప్రస్తుతం అవలంబిస్తున్న విధానం సబబైనది కాదు. త్రాగుడుకు అలవాటుపడటం అజ్ఞానులకు సహజంకావచ్చుకాని నీబోటివాడికి కాదు. త్రాగుడుకు అలవాటుపడి పరస్త్రీ లోలురైనవారు ప్రపంచములో నెవరు బాగుపడిరి. దినదినానికి నీ ఐశ్వర్యముతోబాటు ఆరోగ్యము క్షీణిస్తున్నది. ఈ విధంగా నింకా కొంతకాలము గడచినచో సర్వము నాశనమగునని గుర్తించు. నామాటవిని వృద్ధులగు తల్లిదండ్రులమాట లాలించు. నీ ప్రస్తుత స్థితిని చూచిన నీవారు కృశించిపోతున్నారు. నీ సత్ప్రవర్తనచే వారిని ఆనందింపచేయుడం నీ ధర్మం. ప్రత్యక్ష దైవము తల్లిదండ్రులే కాబట్టి వారి ఆశీర్వాదములు అభివృద్ధికితోడ్పతవి. నీభార్య విద్యావతి. అందగత్తె. ఆమెను స్వీకరించి ఆదర్శవంతమైన జీవితమునుగడపి అత్తమామలకు, తల్లిదండ్రులకు, నీ శ్రేయస్సునుకోరే యితర బంధుమిత్రులకు సంతోషమును చేకూర్చి సుఖించు" అన్నాడు మా బావ.

రామారావు అందుకు తటపటాయించాడు. కాని మా బావ "మనమిద్దరం ఒకసారి మీ అత్తగారి యింటికి వెళ్దాం. పరిస్థితులనుబట్టి నీదారి నీవు చూచుకొందువుగానిలే" అన్నాడు.

రామారావు ముఖంలో అంగీకారం కనుబరచాడు.

"రేపే వెళ్దాం. ఇందుకోసరమని నేను ఆఫీసుకు సెలవుపెట్టాను" అన్నాడు మా బావ.

అది చైత్రమాసం. హటాత్తుగా ఆకాశమంతా మబ్బులు కమ్మినవి. గాలితోకూడి హోరున వర్షము ప్రారంభమగుతుందేమోననిపించింది. గాలికి కిటికీ తలుపులు టప టపా కొట్టుకొంటున్నవి. ఒక మెరుపు మెరిసింది. దాని వెలుతురులోనుండి సరస్వతి ఆమె తల్లి జట్కాబండి దిగివస్తున్న రామారావును, మా బావలను కిటికీలోనుండిచూచి తలుపుతెరచారు.

"రామారావు వచ్చాడండీ!" అన్నది సరస్వతి తల్లి.

వెంకటరావు నిర్ఘాంతపోయాడు. వెంబడే వాళ్లిద్దరిని లోపలకు తీసికొనివెళ్లి కుర్చీలలో కూర్చుండబెట్టాడు. అంతలో సరస్వతితల్లి కాళ్లు కడుగుకోడానికి నీళ్లు, గ్లాసులతో మంచినీళ్లు తీసికొనివచ్చి యిచ్చింది.

"అలాగున్నావేం బాబూ! పున్నమ చంద్రుని బోలిన నీ ముఖము యిలాగున్న దేమిటి? నీకండ్లు ఎలాగ లోనికి పీక్కుపోయినవో చూడు. సమధిక విజ్ఞానవంతుడవైన నీదుప్ప్రివర్తనకిది ఫలితమన్నమాట. మీతల్లిదండ్రులమాట వినకపోవుట నీకు వర్ధమాన లక్షణం కాదు. ఇప్పటికైన గడచినదానికి పశ్చాత్తాపపడి నీభార్యతో సుఖంగా కాపురంచేయిబాబూ! మేమ్ము అందరంకూడ అది

చూచి సంతోషించాలనే యింతకాలం ఎదురు చూస్తూ జీవితం గడుపుతున్నాము. మాకంటె నీ హితము కోరువారెవరు బాబూ" అన్నది అత్తగారు.

రామారావు వంచినతల ఎత్తలేకపోయాడు. అప్రయత్నంగా కండ్లవెంబడి నీళ్లు బొటబొట కారినవి.

మామయ లేచి నిలువబడి "నేనిక సెలవుతీసుకొంటాను. నేను అనుకొన్నపని అయింది. ఇక మీరూ మీరూ అంతా ఒకటి. రామారావు! సరస్వతి అదుగో నీ ఎదుటనున్నది. మీ ఆనందమయమైన దాంపత్యమును చూచి ముగ్ధులు కావడానికి తల్లిదండ్రులు, అత్తమామలు కనిపెట్టుకొనియున్నారు" అని చెప్పి బయలుదేరి వెళ్ళాడు.

అది వెన్నెల రాత్రి. భోజనమయి రామారావు డాబామీదకువెళ్లి వాలుకుర్చీలో కూర్చున్నాడు. చంద్రుడు ఆనాడు మహానందంతో నున్నాడేమో నన్నట్లు పిండారబోసినట్లు వెన్నెల కాస్తున్నది. సరస్వతి మంచినీళ్లచెంబు పట్టుకొని డాబామీదికి వచ్చింది.

రామారావు సరస్వతిని ఎలాగ పలుకరించాలనో అర్థంకాక తబ్బిబ్బులగుతున్నాడు. లేచి మెల్లగా సమీపించి "సరసూ! నిన్ను యింతకాలం నిరాదరణతో చూచి తీరని అపచారంచేశాను. నీవు నన్ను క్షమించి ప్రణయభిక్ష పెట్టినందులకు కృతజ్ఞుడను" అన్నాడు చెక్కిళ్ళను స్పృశిస్తూ.

సరస్వతి పెదవులమీద చిరునవ్వు తొణికిసలాడింది.

"ఇదంతా" దేవి బావగారి మహోపకారఫలితం అన్నది సరస్వతి మెల్లగా.

వెన్నెల కాంతులలో ధవళదేహచ్ఛాయ, విశాల నేత్రాలు, గుండ్రని మొగములతో, ఆమె దేవకన్య ఏమోననిపించింది. రామారావు ఆమెతల నిమురుతూ "నీవు దేవలోకంలో నుండవలసినదానవు సరస్వతీ! పొరబాటున యీలోకంలో పుట్టావు" అన్నాడు.

"మరిమీరూ - మన్మథుడై యుండాల్సింది; పొరబాటున..." అంటూ తన బాహువులతో తన భర్త కంఠాన్ని చుట్టేసింది.

——(o)——


పాతుర్డుగారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

11, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణము బ్రాంచి : | తిరుచినాపల్లి బ్రాంచి : |
| --- | --- |
| 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి. | 15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O. |

అన్ని మందుల షాపులలోను దొరకును.